క్లుప్తంగా

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు అమ్మవారికి మొక్కుగా చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, శంకరయ్య, చిన్నపెద్దన్న, చిన్నన్నలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడిగా వేణు


వేణును అభినందిస్తున్న సంఘం సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా గాజుల వేణు మరోసారి ఎన్నికయ్యారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. పేద పద్మశాలీల కుటుంబాలకు విద్య, వైద్యం, ఆర్థిక పరంగా తన వంతు సాయం అందజేస్తానని నూతన అధ్యక్షుడు ఈ సందర్భంగా ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు చెన్నా వెంకటేశ్వర్లు, భీమునిపల్లె వెంకటసుబ్బయ్య, పినాకపాణి, ఊకొట్టువాసు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమి అయితే ఇంటికి బిల్లు ఎలా ఇచ్చారు


ఆధారాలు చూపుతున్న బాధితులు

బొమ్మల సత్రం: చంద్రబాబునాయుడు 2017లో ప్రవేశ పెట్టిన చుక్కల భూములకు సంబంధించిన జీవో కారణంగానే తాను ఇల్లు కోల్పోయానని మహానంది ఆలయ అధికారులు స్వాధీనం చేసుకున్న భూమి తాలూకా బాధితుడు బాలతిమ్మయ్య వాపోయారు. నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న స్థలం మహానంది ఆలయానికి చెందుతుందని ఇటీవల ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఆ స్థలంలోని ప్లాట్లలో నిర్మించిన భవనాలను కూల్చివేసేందుకు ఆలయాధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అక్కడ ప్లాట్లు కలిగిన వారు చంద్రబాబు తీసుకొచ్చిన జీవోతోనే తమ స్థలం ఆలయభూమిలో చేరిందని, కొలతలు వేసి సర్వేనంబర్ 2247నుంచి తమ ప్లాట్లు వేరు చేయాలని రెవెన్యూ అధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోలేదని ఆదివారం విలేకరుల ఎదుట వాపోయారు. 2016లో చంద్రబాబు పాలనలోనే బాలతిమ్మయ్య గృహాన్ని నిర్మించుకున్నారని..దేవాలయం స్థలం అయితే, అక్కడ గృహనిర్మాణానికి బిల్లులు ఎలా మంజూరు చేశారని అధికారులను ప్రశ్నించారు. తమ వద్ద అన్ని ఆధారాలున్నాయని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

ఈత పోటీల్లో జిల్లాకు రన్నర్షిప్

కర్నూలు కల్చరల్: బాపట్ల డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నరసరావుపేట ఎస్ఎస్ఎన్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన 10వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు స్విమ్మర్స్ ప్రతిభ కనబరిచారు. 8 గోల్డ్, 3 సిల్వర్, 7 బ్రాంజ్ పతకాలతో మొత్తం 18 మెడల్స్ సాధించి ఓవర్ ఆల్ రన్నర్షిప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. దేవ్‌కృత్ సాయి ఐదు గోల్డ్ మెడల్స్, డి.వెంకటేష్ 3 గోల్డ్, ఒక సిల్వర్ మెడల్, సామియా తస్నీమ్ రెండు సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్, మనోజ్ 3 బ్రాంజ్ మెడల్స్, ఫర్హాన్ ఒక బ్రాంజ్ మెడల్, భువనాధిత్య ఒక బ్రాంజ్ మెడల్ సాధించారు. దేవ్‌కృత్ సాయి ఐదు గోల్డ్ మెడల్స్ సాధించడంతో ఇండివిజ్యువల్ చాంపియన్‌షిప్ టైటిల్ అందుకున్నారు. ఏపీ అమెచ్యూర్ అక్వాటిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వి.మోహన్ రామ్, పల్నాడు డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ సుబ్బారెడ్డి, బాపట్ల డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి నాగమురళి, పల్నాడు జిల్లా డీఎస్‌డీఓ జి.సురేష్, కర్నూలు స్విమ్మింగ్ పూల్ కోచ్ నటరాజ్ ఓవరాల్ చాంపియన్‌షిప్, ఇండివిజ్యువల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను అందజేశారు.

దేవదాయ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు

శ్రీశైలం: దేవాదాయ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ జి. ప్రసాదరావు హెచ్చరించారు. ఆదివారం శ్రీశైలం ముఖద్వారం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. శ్రీశైల క్షేత్రంలోకి మాంసం, మద్యం రాకుండా కట్టడి చేశారు. వాహనాలకు సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఏఎస్ఐ గురవయ్య, పీసీలు రఘునాథ్, బాలకృష్ణ, మహేష్, శివ మహేంద్రరెడ్డి, నాను నాయక్ ఉన్నారు.

ప్రత్యేక చట్టాలు రూపొందించాలి



ప్రాణం పోసే వృత్తి వైద్యులది. అలాంటి వైద్యులను అమానుషంగా, రాక్షసంగా బలితీసుకుంటున్నారు. కోల్‌కతాలో వైద్యురాలి హత్య బాధాకరం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి. వైద్యులకు రక్షణ కల్పించే చట్టాలు తేవాలి. డాక్టర్లపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. ముఖ్యంగా మహిళ డాక్టర్ల రక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

–డాక్టర్ ఈశ్వరి, నయన డెంటల్ ఇన్‌స్టిట్యూట్ దంత వైద్యురాలు, నంద్యాల



భద్రత కల్పించాలి



వైద్య చదువులు చదివే వృత్తికి వెళితే పిల్లలు భద్రంగా ఉంటారని తల్లి దండ్రులు ఆలోచిస్తారు. అయితే ఆసుపత్రిలో కూడా రక్షణ లేదని అక్కడ కూడా మానవ మృగాలు దాడి చేస్తాయని కోల్‌కతా ఘటనతో బయట పడింది. ముందుగా మాకు రక్షణ కావాలి. భద్రత కల్పించాలి. కష్టపడి పని చేస్తాం కాని పని ప్రదేశంలో ప్రశాంత వాతావరణం కల్పించాలి. ఇందుకు ప్రభుత్వాలు తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలి. లేకపోతే మహిళా డాక్టర్లు భయపడుతూ విధులు నిర్వహించాల్సి వస్తుంది.

–డాక్టర్ హరిత, ఐఎంఏ అకాడమీ మెడికల్ స్పెషాలిటీస్ విభాగం అధ్యక్షురాలు, నంద్యాల

ఓపెన్ స్కూల్ పిలుస్తోంది

- వివిధ కారణాలతో విద్యకు దూరమైన వారికి సువర్ణ అవకాశం
- పది, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- 14ఏళ్లు నిండిన వారు పదవ తరగతికి
- 15ఏళ్లు నిండిన వారు ఇంటర్‌కు అర్హులు
- జిల్లాలో 61 ఓపెన్‌స్కూల్ స్టడీ సెంటర్లు
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈనెల 27తో గడువు


తరగతి గదిలో ఓపెన్ స్కూల్ అభ్యాసకులు (ఫైల్)

ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు : 27-08-2024
ఫీజు చెల్లించడానికి గడువు : 28-08-2024
రూ.200 లేటు ఫీజుతో అడ్మిషన్‌కు చివరి తేదీ : 04-09-2024


ఓపెన్ స్కూల్ సొసైటీ లోగో

నంద్యాల(న్యూటౌన్): వివిధ కారణాలలో విద్యకు దూరమైన వారు తిరిగి తమ చదువు కొనసాగించే అవకాశం ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) కల్పిస్తోంది. ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో పాఠశాల విద్యను మధ్యలో మానేసిన వారు ఓపెన్‌స్కూల్‌లో చదువుకోవచ్చు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఇటీవలే విడుదలైంది. 14 ఏళ్లు నిండిన వారు పది, 15 ఏళ్లు నిండిన వారు ఇంటర్‌ను దూర విద్యావిధానంలో చదువుకునే వెసులుబాటు కల్పించారు.

ఉన్నత విద్యకు సోపానం...

ఉద్యోగాల్లో పదోన్నతులకు, ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ మార్గం ఎంతో ఉపయుక్తంగా ఉంది. ఈ పథకం 1991లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అప్పట్లో దీనికి పెద్దగా ఆదరణ లేకపోయినా డాక్టర్ వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మహర్దశ పట్టింది. దూర విద్య ద్వారా పదో తరగతి అనే పథకం తిరిగి అమలులోకి తీసుకోచ్చారు. దీంతో పాటు 2010–11లో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు. ఈ సొసైటీ ద్వారా పొందే ఇంటర్, పదోతరగతి సర్టిఫికెట్లు రెగ్యులర్ స్కూల్, కళాశాలల్లో పొందే సర్టిఫికెట్లతో సమానం అని ప్రభుత్వ ప్రకటించడంతో ఓపెన్‌స్కూల్ విద్యకు ఆదరణ పెరిగింది.

జిల్లాలో 61 స్టడీ సెంటర్లు

జిల్లా వ్యాప్తంగా పది, ఇంటర్మీడియెట్‌కు సంబంధించి 61 ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లు ఉన్నాయి. ఈ విధానంలో విద్యా విషయక సబ్జెక్టులతో పాటు వృత్తి విద్యకు సంబంధించిన కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ స్కూల్ ధ్రువపత్రం ద్వారా ఉన్నత చదువులు, వృత్తి విద్యాకోర్సులను అభ్యసించవచ్చు. ఇంటర్‌కు సంబంధించి సైన్స్, ఆర్ట్స్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులు పూర్తి చేసేందుకు వయో పరిమితి లేదు.

అర్హతలు..

పదిలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి ఉండదు. చదవడం, రాయడం తెలిసి ఉండాలి. దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు సీటు, పుట్టిన తేదీ, ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఇంటర్మీడియెట్‌లో చేరే వారికి ఆగస్టు 31వ తేదీ నాటికి 15 సంవత్సరాలు నిండి ఉండాలి. ఇంటర్ 10వ తగరతి మార్కుల జాబితా, టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి. ఇతర సమాచార కోసం www.apopenschool.orgవెబ్‌సైట్‌ను చూడాలి.

సెలవుల్లో తరగతుల నిర్వహణ...

ఓపెన్ స్కూల్ చదువుకు సంబంధించిన క్లాసులను సెలవు రోజుల్లో నిర్వహిస్తారు. ఎంపిక చేసిన స్టడీ సెంటర్లలో జరిగే తరగతులకు అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుంది. ఇంటర్ సైన్స్ గ్రూపునకు సంబంధించి ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షల క్లాసులకు హాజరుకావాలి. ప్రతి అభ్యాసకుడు కనీసం 30 తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది.

ప్రవేశాలు ఇలా..

ఈ నెల 28 తేదీలోగా ఆన్‌లైన్‌లో అడ్మిషన్ పొందవచ్చు. రూ.200 ఆపరాధ రుసుంతో ఈనెల 29వ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు అడ్మిషన్ పొందవచ్చు. పదో తగరతికి సంబంధించి జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1550, అన్ని వర్గాల మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్టేషన్, అడ్మిషన్ ఫీజు రూ.1150 చెల్లించాల్సి ఉంది. ఇంటర్‌కి సంబంధించి జనరల్, పురుషులకు రూ. 1800, అన్ని వర్గాల మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీలకు రూ.1500 చొప్పున ఫీజు చెల్లించాలి.

నోటిఫికేషన్ వెలువడింది



ఈ ఏడాది సార్వత్రిక విద్యా ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. ఎలాంటి అవరాధ రుసుం లేకుండా ఆగస్టు 28 వరకు గడువు ఉంది. గ్రామీణ బాలికలు, మహిళలు, యువత, ఉద్యోగులు సైతం దీనిని సద్వినియోగం చేసుకోవచ్చు. మహిళలకు రాయితీ ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులకు ఫీజుల్లో కూడా రాయితీ ఉంది.

–లక్ష్మీనారాయణ, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్, నంద్యాల

ఉన్నత చదువులకు దోహదం



వివిధ కారణాలతో చదువకోలేకపోయినవారికి, మధ్యలో నిలిపివేసిన వారికి సార్వత్రిక విద్య ఓ వరం లాంటింది. పది, ఇంటర్ పూర్తిచేయడానికి ఈ ఏడాది నోటిఫికేషన్ వెలువడింది. అందరూ సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యతను తగ్గించేందుకు ప్రభుత్వం ఓపెన్ స్కూల్‌ను ప్రవేశపెట్టింది. ఓపెన్ స్కూల్ రెగ్యులర్ విద్య సర్టిఫికెట్‌తో సమానం ఉన్నత చదువులు, ఉద్యోగాలకు కూడా ఉపయోగపడుతుంది. –సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

మెగా జాబ్ మేళాలో 49 మందికి ఉద్యోగాలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ, ఐసీఐసీఐ బ్యాంకు నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 49 మందికి ఉద్యోగాలు లభించినట్లు ప్రిన్సిపాల్ చంద్రమౌళీశ్వరరెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లాకు సంబంధించిన నిరుద్యోగులు ఈ మేళాలో పాల్గొన్నారన్నారు. నిరుద్యోగుల కోసం భవిష్యత్తులో మరెన్నో జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తామన్నారు. అర్హత సాధించిన వారిని వెంకటేశ్వర జూనియర్ కళాశాల యాజమాన్యం అభినందించింది.

నేడు గోస్పాడులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

గోస్పాడు: మండల కేంద్రం గోస్పాడులో నేడు శ్రీకృష్ణాష్టమి సందర్భంగా వేణుగోపాలస్వామి దేవాలయంలో వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ముక్కమల్ల వేణుగోపాల్‌రెడ్డి, ఏపీపీ వివేకానందరెడ్డి తెలిపారు. ముందుగా వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి భక్తులకు ఉచిత అన్నదానం చేస్తామన్నారు. మరుసటిరోజు శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

30 వేల క్యూసెక్కుల నీటి విడుదల

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 30,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎస్ఆర్ఎంసీ ద్వారా 30 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందన్నారు. ఈ నీటినంతా దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. జీఎన్ఎస్ఎస్‌కు 14 వేల క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 4 వేల క్యూసెక్కులు, తెలుగుగంగ (వీబీఆర్)కు 12 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.

1,337 క్యూసెక్కుల నీటి విడుదల

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పుల వాగుకు 1,337 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,638 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు చెప్పారు. ఈ నీటిని నిప్పుల వాగుకు 1,337 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 246 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 55 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

అపూర్వ కలయిక



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 1976 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఓ హోటల్‌లో కలిశారు. 50 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సంతోషంగా గడిపారు. భవిష్యత్తులో వృద్ధాశ్రమాలకు చేయూతనందించడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు పూర్వ విద్యార్థి, రిటైర్డు ఎంఈఓ బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

29న వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

కర్నూలు కల్చరల్: తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ నెల 29న సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఉదయం 10.30 గంటల నుంచి 'దేశ భాషలందు తెలుగు లెస్స' అంశంపై పోటీలు ఉంటాయని చెప్పారు. వక్తృత్వ పోటీలో ఒక్కొక్కరికి 3 నిమిషాల వ్యవధి ఉంటుందని, ఎలాంటి ఆంగ్ల పదాలు వాడకూడదని, వ్యాసరచనకు గంట వ్యవధి ఉంటుందని మూడు పేజీలకు మించకుండా వ్యాసం రాయాలని పేర్కొన్నారు. ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 5 కన్సోలేషన్ బహుమతులిస్తామన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి


మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో భూమిని శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. మున్సిపాలిటీలో అధికారులు అవినీతిలో కూరుకొని పోయారన్నారు. పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం ఊసే లేదన్నారు. చిన్నపాటి వర్షానికే నీరు రహదారుల్లో నిలిచిపోతుండటంతో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అక్టోబర్‌లో మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, తోటమద్దు, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్‌స్ట్రక్షన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 12, 14 జీవోలను రద్దు చేయాలన్నారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం నంద్యాలకు సమీపంలో ఇసుకరీచ్‌లను ప్రారంభించాలన్నారు. ప్రస్తుతం ఇసుక అందని ద్రాక్షలా మారిందని అన్నారు. ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి గుర్తింపు కార్డు ఇవ్వాలన్నారు. అనంతరం ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మున్నా, కార్యదర్శుడిగా ఇంతియాజ్, ఉపాధ్యక్షుడిగా రహిమాన్, సహాయ కార్యదర్శులుగా షబ్బీర్, ఇలియాస్, మహబూబ్‌బాషాలతో పాటు 12మందిని ఎన్నుకున్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలను జయప్రదం చేయండి


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 27న శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల యాదవ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం వారు పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణ ఆలయంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడి మూలవిరాట్‌కు తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. గోపూజ కార్యక్రమం నిర్వహించి ఉట్టికొట్టే కార్యక్రమాన్ని, వెన్నముద్దల వేలం పాట, చక్కభజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక పోటీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్థసారథి యాదవ్, విజయచంద్రుడు యాదవ్, బోధనం చంద్రశేఖర్, పృథ్వీరాజ్‌యాదవ్, మహేష్ యాదవ్, లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవా అవార్డు ప్రదానం

కర్నూలు(అర్బన్): నగరానికి చెందిన ఎస్.వెంకట రామరాజు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఆదివారం నెల్లూరులో జరిగిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అవార్డుల ఉత్సవాల్లో ఆయనకు లయన్స్ క్లబ్ గవర్నర్ వై.నాగేశ్వరరావు అవార్డును అందించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ.. నగరంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టడం వల్ల తాను ఈ అవార్డుకు ఎంపికయ్యానన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. లయన్ క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్లు, రాయపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మద్యం బాటిళ్ల పట్టివేత


మద్యం బాటిళ్లతో ఎస్ఐ వెంకటేష్

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో పోలీసులు దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన విజయుడు అనే వ్యక్తి దొంగచాటున మద్యం బాటిళ్ల విక్రయిస్తుండగా సోదాలు చేసి 20 బాటిళ్లను సీజ్ చేశారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

నాటు సారా బట్టీలపై దాడులు


సారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతంలోని నాటు సారా తయారీ బట్టీలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. హరినగరం సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడికి వెళ్లి 10 డ్రమ్ముల్లో నిల్వ ఉన్న 1800 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. అలాగే సారా తయారీ కోసం ఏర్పాటు చేసిన బట్టీని, డ్రమ్ములను మొత్తం ధ్వంసం చేశామని ఎస్ఐ వరప్రసాదు తెలిపారు.

నిర్లక్ష్యం వెలుగుతోంది!


జిల్లా ఆసుపత్రి వద్ద పగలు వెలుగుతున్న లైటు


రెవెన్యూ భవనంలో ఉద్యోగులు లేకున్నా తిరుగుతున్న ఫ్యాన్లు, లైట్లు

నంద్యాల(అర్బన్): అప్రకటిత విద్యుత్ కోతలతో వినియోగదారులను అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రతిరోజు ఏ సమయంలో కరెంటు ఉంటుందో, పోతుందో తెలియని పరిస్థితి. అయితే, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రం విద్యుత్‌ను వృథా చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా లైట్లు వెలుగుతున్నాయి. ఫ్యాన్లు తిరుగుతున్నాయి. వాటిని గమనించి ఆర్పివేసే వారు లేరు. నంద్యాల జిల్లా ఆసుపత్రి, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్, కేసీ కెనాల్, తెలుగుగంగ కార్యాలయాల వద్ద ఈ పరిస్థితి అధికం. ఆయా ఆఫీసుల వద్ద పగటి పూట విద్యుత్ బల్బులు వెలుగుతుండటం అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది. ఇప్పటికైనా విలువైన విద్యుత్ వృథా కాకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వేలాడుతున్న యమపాశాలు


గ్రామంలోని ప్రధాన కూడలిలో ఓ ఇంటిపై వెళ్లిన విద్యుత్ తీగలు

దొర్నిపాడు: ప్రమాదం జరిగితేగానీ పట్టించుకునేలా లేరు విద్యుత్ శాఖ అధికారులు. మండలంలోని చాకరాజువేముల గ్రామంలో విద్యుత్ తీగలతో పాటు 11 కేవీ తీగలు కూడా ఇళ్లపై వేలాడుతున్నాయి. వర్షాకాలంలో తేమకు ఇళ్లకు విద్యుత్ ప్రవాహమై ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీంతో ఆ గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. 11కేవీ తీగలు కావడంతో మిద్దెలు ఎక్కాలంటే భయపడుతున్నారు. అధికారులు స్పందించి ఇళ్లపై వెళ్లిన విద్యుత్ తీగలను మార్చాలని వారు కోరుతున్నారు. విద్యుత్ శాఖ ఏఈ రామ్మోహన్ వివరణ కోరగా నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు ఇళ్లపై లేకుండా చేస్తామన్నారు.

మద్దిలేటిస్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహ స్వామిని కర్నూలు జిల్లా జడ్జి జి.కబర్థి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. ఆయన వెంట డోన్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ ఉన్నారు.

వక్ఫ్ భూములు లాక్కోవడానికే నూతన చట్టం


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

- రౌండ్‌టేబుల్ సమావేశంలో మైనార్టీ నాయకుల ధ్వజం

ఆళ్లగడ్డ: బీజేపీ ప్రభుత్వం దేశంలోని వక్ఫ్‌భూములు లాక్కోవడానికే నూతన చట్టం తీసుకొస్తుందని మైనార్టీ నాయకులు, ఎంఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి, ఖాదర్‌బాషా ధ్వజమెత్తారు. ఆదివారం పట్టణంలోని షాదీఖానాభవన్‌లో స్థానిక జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 70 శాతం భూములు ఆక్రమణకు గురయ్యాయన్నారు. మిగిలిన భూములను కూడా లాక్కోవాలని ఈనెల8న పార్లమెంట్‌లో బిల్లు తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలు ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతున్నారన్నారు. వక్ఫ్ సవరణ–2024 బిల్లును కేంద్రం వెనక్కి తీసుకోవాలన్నారు. లేదంటే ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ముస్లిం జేఏసీ కన్వీనర్ బీరువాల బాషా, నంద్యాల జేఏసీ నాయకులు మౌలానా, ఎస్ఏ గఫూర్, సద్దాం హుసేన్, ముస్లిం నాయకులు మెకానిక్ గౌస్‌పీరా, మాసివుల్లా, ఖాదర్‌బాషా, మైనుద్దీన్, హుసేన్‌బాషా, షంషెల్‌హక్, ఆవాజ్ కమిటీ సభ్యులు ఇస్మాయిల్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.